క్లుప్తంగా

ఇంటి ప్రహరీ కూల్చివేతపై విచారణ



రఘుదేవపురంలో ఇంటి ప్రహరీ కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగలత

సీతానగరం: రఘుదేవపురంలో తన ఇంటి ప్రహరీ, మెట్లను నిబంధనలకు విరుద్ధంగా పడగొట్టారంటూ చినకొండేపూడికి చెందిన పెన్నాడ జానకి రామయ్య ముఖ్యమంత్రి కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ డివిజనల్ అధికారి నాగలత మంగళవారం విచారణ నిర్వహించారు. గోడ కూల్చిన ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జానకి రామయ్య నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, వంగలపూడి, చినకొండేపూడి పంచాయతీ కార్యదర్శులు సుజాత, శ్రీనివాస్ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద కిలోన్నర గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను మంగళవారం ఎస్సై శ్యామ్ సుందర్ అరెస్ట్ చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోకవరానికి చెందిన జెర్రీ, నరసాపురానికి చెందిన జయరామ్ సేకరించిన గంజాయిని కాపవరానికి చెందిన సాయి, నరసాపురానికి చెందిన సతీష్ తరలిస్తున్నారు. పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా వారిద్దరూ పట్టుబడ్డారు. కాగా.. జయరామ్, జెర్రీలు పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్ సుందర్ తెలిపారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తికి రిమాండ్

సీతానగరం: చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని అచ్యుయ్యపాలేనికి చెందిన ఉల్లింకుల రామకృష్ణకు కోర్టు రిమాండ్ విధించిందని హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. రామకృష్ణ సారా తయారు చేసి, అమ్ముతుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. అతడి నుంచి 70 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించిందని, జైలుకు తరలించామని తెలిపారు.


ఇంటర్ పరీక్షలకు 41 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రంలో మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1 పరీక్షలు జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు హేమ, మాధురి తెలిపారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన విద్యార్థులు ఏ, బీ సెంటర్లు కలిపి మొత్తం 749 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఏ సెంటర్‌లో 26 , బి సెంటర్‌లో 15 మంది పరీక్షలకు గైర్హాజరు అయ్యారని తెలిపారు.

బయోగ్యాస్ పరిశ్రమకు వ్యతిరేకంగా తీర్మానం

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో నిర్మిస్తున్న బయోగ్యాస్ పరిశ్రమకు వ్యతిరేకంగా గ్రామ పంచాయతీ తీర్మానం చేసినట్టు సర్పంచ్ వేము మాధవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 153-1లో 8.99 సెంట్ల ప్రభుత్వ భూమిలో బయోగ్యాస్ పరిశ్రమ నిర్మాణానికి అనుమతులు కోరుతూ తహసీల్దార్ కార్యాలయం నుంచి నోటీసు అందిందని దాని నిమిత్తం మంగళవారం స్థానిక పంచాయతీ వద్ద గ్రామసభ నిర్వహించామన్నారు. ఈ గ్రామసభలో గ్రామస్తులంతా ఏకమై బయోగ్యాస్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ తీర్మాన పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎల్. త్రిమూర్తులు, వీఆర్‌ఓ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కేశవస్వామి కల్యాణం



పందలపాకలో కేశవస్వామి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత కేశవ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చకులు వింజరపు కేశవచార్యులు సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి వేద పండితులు కల్యాణం చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని కల్యాణాన్ని తిలకరించారు.

దాన ధర్మాల మాసం రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక నమాజులు
- కఠిన ఉపవాస దీక్షల్లో ముస్లింలు



పందలపాక మసీదులో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు



మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు

బిక్కవోలు: ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం రంజాన్. ఈ మాసాన్ని దానధర్మాల మాసంగా చెబుతారు. ఇస్లాం మత బోధనల ప్రకారం జీవితాన్ని సన్మార్గంలో పెట్టేందుకు శిక్షణ పొందే మాసంగా రంజాన్ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఈ మాసం అనంతరం వచ్చే 11 నెలల కాలంలో సన్మార్గంలో జీవించే విధానాన్ని అలవరుస్తోంది. ఆరాధనల విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైనది. విధిగా చేయవలసిన సమాజ్, రోజా, జకాత్, ఫిత్రా వంటి సత్కార్యాలే కాకుండా, అల్లా ప్రసన్నత కోసం ఖురాన్ పఠనం చేస్తారు. ఖురాన్‌లో చెప్పినట్టు చేసే ప్రతి మంచి పనీ దైవారాధన కిందికే వస్తుంది.

70 రెట్ల పుణ్యం

రంజాన్ మాసంలో చేసే సత్కార్యాలకు 70 రెట్ల పుణ్యం ఎక్కువగా లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఈ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందని చెబుతున్నారు. అందుకే ఈ మాసంలో ముస్లింలు అత్యధికంగా దానధర్మాలు చేస్తుంటారు. ఈ మాసంలో నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష చేస్తారు. సూర్యోదయానికి ముందు ఆహారం(సహర్) భుజించి దీక్షను చేపడతారు. మళ్లీ సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత కొద్దిపాటి ఆహారాన్ని (ఇఫ్తార్) స్వీకరించి దీక్షను విరమిస్తారు. ఇలా రంజాన్ నెలంతా కఠిన ఉపవాసాలు పాటిస్తారు.

ఇస్లాంలో దానధర్మాలు కీలకమైనవి. తమ వద్ద ఉన్న సంపద నుంచి జకాత్ చెల్లిస్తారు. సంపద విలువలో 2.5 శాతం లెక్కించి, వచ్చే సొమ్మును పేదలకు పంచుతారు. బంగారం, వెండి, నగదు ఇలా.. వారి వద్ద ఉన్న వాటిపై నిర్ణీత సొమ్మును జకాత్ తీయడం ద్వారా, మిగిలిన సంపద శుద్ధి అయినట్టు భావిస్తారు. ఇది ముస్లింలు కచ్చితంగా చేపట్టాల్సిన నియమం. ఈ మాసంలో తప్పనిసరిగా పేదలకు ఇవ్వాల్సినది ఫిత్రా. రంజాన్ నెలంతా చేసే పుణ్యకార్యాలు, ప్రత్యేక ప్రార్థనలు అల్లా వద్ద ఆమోదం పొందాలంటే, ఈద్ సమాజ్ కన్నా ముందుగా ఫిత్రా కచ్చితంగా చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉంటే, అందరి పేరిట ఫిత్రా తప్పనిసరిగా ఇవ్వాలి. అప్పుడే పుట్టిన బిడ్డ పేరున కూడా ఫిత్రా ఇవ్వాలని ముస్లిం పెద్దలు చెబుతున్నారు.

పేద-ధనిక సమానత్వం

రంజాన్ మాసం పేదలు, ధనికుల మధ్య తారతమ్యాలను చెరిపేస్తుంది. పేద, ధనిక తేడా లేకుండా మసీదుల్లో పక్కపక్కనే నిలబడి నమాజులు చేయడం కనిపిస్తుంది. అందుకే పేదలు కూడా ధనికులతో సమానంగా పండగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే జకాత్, ఫిత్రా దానం చేయాలని ఇస్లాంలో తప్పనిసరి చేశారు. అందుకే ముస్లింలు ఈ మాసంలో ఇతోధికంగా దానధర్మాలు చేస్తూ, ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడరు. అప్పు చేసి దానధర్మాలు చేయడం ఇస్లాంలో సమ్మతించలేదు. ముస్లిం దేశాల్లో జకాత్ వసూలు ప్రభుత్వ పరంగా జరుగుతుంది. కొన్ని స్వతంత్ర సంస్థలు ప్రభుత్వ పర్యవేక్షణలో కార్యక్రమాలు చేస్తుంటాయి.

దానంతో పుణ్యఫలం



రంజాన్ మాసంలో రూపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. అర్హుడైన ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. తను ఉన్న ఇల్లు కాక, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయం, సంపదలో 2.5 శాతం జాకాత్‌గా చెల్లించాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండగ చేసుకోవడానికే ఈ జకాత్, ఫిత్రా చెల్లించాలి.

– మౌలానా షేక్ గులాంగౌస్ రిజ్వీ, జామియా మసీద్, పందలపాక

ఫిత్రా దానం చేయాలి



ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు వెళ్లే ముందు ప్రతి ముస్లిం తన పేరిట ఫిత్రా పేదలకు దానం చేయాలి. కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరి పేరున ఫిత్రా కచ్చితంగా దానం చేయాలి.

– షేక్ రెహమాన్, ముస్లిం పెద్ద, పందలపాక

ఆరోగ్య సమస్యలతో జాగ్రత్త



ఉపవాసం సమయంలో మంచి ఆహారం తీసుకోవాలి. ఎక్కువ ప్రొటీన్, ఫైబర్ ఉన్న ఆహారం, పండ్లు, కూరగాయలు తీసుకోవడం మంచిది. ఇఫ్తార్ సమయంలో ఒకేసారి ఎక్కువ ఆహారం తినరాదు. నీరు, నిమ్మరసం వంటి పానీయాలను తీసుకోవడం శ్రేయస్కరం.

– మల్లిడి కృష్ణారెడ్డి, అధినేత, సూరారెడ్డి నర్సింగ్ హోమ్, పందలపాక

భూసార పరీక్షలతో ఎంతో ప్రయోజనం



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు

రాజానగరం: ఈ వేసవిలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని చక్రద్వారబంధంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతాంగానికి సలహాలు, సూచనలిచ్చారు. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. వేసవి సీజన్ ప్రారంభమైన ప్రస్తుత సమయంలో పొలాలను పచ్చదనంతో కప్పి ఉంచడం ఎంతో అవసరమన్నారు. ఇందుకోసం జీలుగ, జనుము, పిల్లిపెసర, విత్తనాలను చల్లాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడటంతో పాటు భూసారాన్ని పెంపొందించడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయన్నారు. తద్వారా ఆయా భూములలో సాగు చేసే పంటల ద్వారా మంచి దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ డీఆర్సీ జయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్, హెచ్‌ఈఓ అరవింద్ సాయి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

బిక్కవోలు: మండలంలోని కాపవరం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రిని దాతలు అందజేశారు. మంగళవారం పాఠశాల వద్ద మానవసేవే మాధవసేవ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సామగ్రిని విద్యార్థులకు అందించారు. ఫౌండేషన్ ఫౌండర్ సత్యంశెట్టి ఉమామహేష్, రవిరత్నం తదితరులు పాల్గొన్నారు.

చదరంగం క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందజేత



లలిత నాగ వరహాలుకు చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి

పెదపూడి: మండపేటలో నిరుపేద కుటుంబానికి చెందిన చదరంగ క్రీడాకారిణి లలిత నాగ వరహాలుకు అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన దివంగత సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి వారు రూ.28 వేల ఆర్థిక సాయం అందజేశారు. పొలమూరు గ్రామంలో మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి చేతుల మీదుగా చెక్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండపేటకు చెందిన లలిత నాగ వరహాలు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేక చదరంగ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిందన్నారు. ఈమె చెస్ ఆర్బిటర్‌గా కూడా పని చేస్తుందన్నారు. ఆమె ఆశయానికి ఆర్థిక పరిస్థితి ఆటంకంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఆశయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఆర్థిక సాయాన్ని ట్రస్ట్ తరుపున అందజేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ సత్తి సూరారెడ్డి, ధాత్రి చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి చింతా ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మల్లిడి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లోని దుకాణాలు, హోటళ్ల వద్ద యజమానులు ప్రత్యేకమైన డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి సూచించారు. పెదపూడి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో పాడైన కూరగాయలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. వచ్చే 20 రోజుల్లో గ్రామంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా, ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, సచివాలయం కార్యదర్శులు ఉషారాణి, అనంతలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు ఉజ్వల భవిష్యత్తు



జి.మామిడాడ బీపీఈడీ కళాశాలలో స్పోర్ట్స్ ప్రాజెక్ట్ మీట్‌ను ప్రారంభిస్తున్న శ్యామ్‌కుమార్

పెదపూడి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానంలో వ్యాయామ విద్యకు ప్రాధాన్యం ఉందని జేఎన్‌టీయూకే అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి.శ్యామ్ కుమార్ అన్నారు. జి.మామిడాడ గ్రామంలో డీఆర్‌కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో జరిగిన స్పోర్ట్స్ ప్రాజెక్టు మీట్‌ను శ్యామ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే కాలంలో వ్యాయామ విద్యకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఆర్గనైజేషన్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఏలా ఉండాలో ఇలాంటి ప్రాజెక్ట్ మీట్‌ల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. డీఆర్‌కె విద్యాసంస్థల అధినేత డీఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ తమ కాలేజీలో వ్యాయామ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం రన్నింగ్, వాలీబాల్, లాంగ్‌జంప్, త్రోబాల్ తదితర క్రీడల్లో రాణించిన విజేతలకు బహుమతులు అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎల్‌ఆర్ డిగ్రీ, డీఎస్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లు డాక్టర్ టి.శ్రీనివాస్‌రెడ్డి, పి.త్రివేణి, ప్రముఖ వైద్యుడు కోనాల తమ్మిరెడ్డి, స్థానిక ఓల్డ్ ప్లేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి మండ రాజారెడ్డి, ఇల్లపల్లి జెడ్పీ హైస్కూల్ పీడీ పప్పు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ



చినకొండేపూడిలో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

సీతానగరం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆ పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. చినకొండేపూడిలోని ఆయన ఇంటి వద్ద మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు సర్కార్‌పై నిరసన గళం వినిపించడానికి యువత పోరు చేపట్టడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో జరిగే ఈ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లడం జరుగుతుందన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న మాట్లాడుతూ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలన్నారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు (తోటలో రాజు) మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మట్టా వసంతరావు, ద్వారంపూడి రామకృష్ణ, ముదునూరి రామకృష్ణంరాజు, తోరం బ్రహ్మాజీ, సలాది వాసు, మట్టా కాపు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతానికి పిలుపు

రంగంపేట: రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు కోరారు. వడిశలేరులోని మాజీ ఎంపీపీ పోతుల బులివీర్రాజు ఇంటి వద్ద మంగళవారం యువత పోరు పోస్టర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు ఆవిష్కరించారు. జగన్ ప్రభుత్వంలో ఫీజు రీయంబర్స్‌మెంటు ద్వారా ఎంతో మంది విద్యార్థులు లబ్ధి పొందారని తెలిపారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నాయకులంతా వినతిపత్రం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వేము చిరంజీవి, మంగిన రాంబాబు, కర్రి బాబులు, నలమాటి భీముడు, నిమ్మలపూడి శ్రీధర్, గవరసాని రాజు పాల్గొన్నారు.

ఊలపల్లిలో అన్నసమారాధన

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో భారీ ఎత్తున్న అన్న సమారధన నిర్వహించారు. మంగళవారం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంవద్ద స్వామి కల్యాణం పురస్కరించుకుని భారీఎత్తున అన్న సమారాధన చేశారు. అర్చకులు శ్రీనివాసుల సత్యనారాయణ ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామస్థులు, చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని అన్న సమారాధనలో పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి పరస్పర చర్యల కోసం జిల్లా పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకుల సూచనలను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్‌వో, డీఈవో, సీఈవో స్థాయిలో పరిష్కరించని సమస్యల కోసం ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానిస్తోందన్నారు. రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియల అన్ని అంశాలను కవర్ చేసే చట్టబద్ధమైన ఫ్రేమ్ వర్క్ ప్రకారం కమిషన్ గుర్తించిన 28 వాటాదారులలో రాజకీయ పార్టీలు కీలకమన్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడానికి వికేంద్రీకృత, బలమైన, పారదర్శక, చట్టపరమైన (ఫ్రేమ్ వర్క్) చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఈలకొలనులో ఆక్రమణ భూమి స్వాధీనం

తహసీల్దార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అప్పగింత



ఈలకొలనులో జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

రంగంపేట: మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో కబ్జా భూమిని స్వాధీనం చేసుకుని అర్హులైన లబ్ధిదారులకు అప్పగించడం జరిగిందని తహసీల్దార్ కోసు అనసూయ తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈలకొలను గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా దళితులు, పేదలకు సర్వే నంబరు 12లో ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. సుమారు 15 మందికి ఇచ్చిన ఇళ్ల స్థలాలను అదే గ్రామానికి చెందిన కురుకూరి శ్రీను, కురుకూరి దుర్గాప్రసాద్, కురుకూరి శ్రీనివాస్‌లు ఆక్రమించుకున్నారన్నారు. ఆ స్థలాలలో మట్టితో మెరక చేయించి, చుట్టూ కంచె వేసి కబ్జా చేశారన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో బాధితులు కలెక్టర్ ప్రశాంతికి తమ స్థలాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ప్రశాంతి సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని రంగంపేట తహసీల్దార్ కోసు అనసూయను ఆదేశించారు. దీంతో మంగళవారం తహసీల్దార్ అనసూయ స్థానిక ఎస్ఐ తోట కృష్ణసాయి ఆధ్వర్యంలో ఈలకొలనులోని కబ్జా భూమిని స్వాధీనం చేసుకుని ఆక్రమణలు తొలగించారు. అనంతరం స్థలాన్ని సర్వే చేసి ప్లాట్లుగా విభజించి లబ్ధిదారులకు అప్పగించారు.

ఈ సమయంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వద్దు

కంబాలచెరువు: పరీక్షల సమయంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వరుల అప్పయ్యశాస్త్రి మంగళవారం తెలిపారు. పాఠశాలల్లో పదో తరగతి గ్రాండ్ టెస్టులు, పబ్లిక్ పరీక్షల సన్నద్ధత, సరస్వతి పూజలు తదితర బిజీ పరిస్థితుల్లో ఈ నెల 12న స్కూల్ కాంప్లెక్స్ (క్లస్టర్) సమావేశాల అవసరం ఏముందని, వాటిని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రభుత్వానికి తెలిపారన్నారు. స్కూల్ కాంప్లెక్స్ (క్లస్టర్) సమావేశాలను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకూ నిర్వహించాలని విద్యాశాఖ తెలిపిందన్నారు. ఈ నెల 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకాబోతున్నాయన్నారు. అదే విధంగా సరస్వతీ పూజలు నిర్వహించబోతున్నారన్నారు. రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలల్లో ఒకపూట బడులు నిర్వహిస్తున్నారని, ముస్లిం ఉపాధ్యాయులు రంజాన్ మాసంలో ఉపవాస ప్రార్థనలో ఉన్నారన్నారు. ఆయా క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పబ్లిక్ పరీక్షల నిర్వహణ నిమిత్తం దూర ప్రాంతాల్లోని స్కూళ్లలో చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా నియామకమై, వారి పనుల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. కొన్ని క్లస్టర్ కాంప్లెక్స్ పాఠశాలల్లో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు 12 గంటల వరకు పాఠశాలను నిర్వహించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేసి, మధ్యాహ్నం ఒంటిగంటకు ఇతర గ్రామాల్లో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లకు వెళ్లాలని హడావుడిగా నిర్దేశించడం సబబుగా లేదన్నారు. విద్యాశాఖ హడావుడి నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇటువంటి సమయాల్లో స్కూల్ కాంప్లెక్స్ (క్లస్టర్) సమావేశాలను రద్దు చేయాలన్నారు.

ఈఎస్ఐ సేవలు త్వరలో ప్రారంభించాలి

కంబాలచెరువు: రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పరిశ్రమల కార్మికులకు ఉపయోగపడేలా నిర్మించిన ఈఎస్ఐ ఆసుపత్రిలో సేవలను త్వరలో ప్రారంభించాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. పేపర్ మిల్లు ఎదురుగా నూతనంగా నిర్మించిన 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల చేసే సందర్భంగా కమిషనర్ మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రి భవనాన్ని సీపీడబ్ల్యూడీ చీఫ్ ఇంజినీర్ ఆమోదించిన ప్రణాళిక మేరకు పరిశీలించారు. ఏపీ బిల్డింగ్ రూల్స్‌కి అనుగుణంగా ఉందా, లేదా అనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, బయో మెడికల్ వేస్ట్ ప్రోసెసింగ్ కోసం షెడ్డు నిర్మించాలని సీపీడబ్ల్యూ ఇంజినీర్లకు జారీ చేశారు.

కంటి ఆరోగ్యంపై అవగాహన అవసరం

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- గ్లకోమా వారోత్సవాలు ప్రారంభం



గ్లకోమా వారోత్సవాలలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలందరూ అవగాహనతో కంటి ఆరోగ్యం కాపాడుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా మంగళవారం బొమ్మూరులోని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలు జరుగుతాయన్నారు. చూపు మసకబారడం, విపరీతమైన కంటినొప్పి, కంటి ఎరుపుదనం, తలనొప్పి, వికారం, వాంతులు, తరచుగా కంటి అద్దాల పవర్ మారడం, ప్రకాశవంతమైన లైటు చుట్టూ ఇంద్రధనుస్సు లాంటి రంగుల వలయాలు కనిపించడం, ఆకస్మికంగా కంటిచూపు కోల్పోవటం గ్లకోమా వ్యాధి లక్షణాలు అన్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరిలో ఆప్టిక్ నాడికి రక్త ప్రసారణ తగ్గటం వలన ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ లావణ్య, ఎపిడిమలాజిస్ట్ సుధీర్ కుమార్, డిప్యూటీ డెమో ఎస్.సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.